నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 02, 2023 | www.navatelangana.com

78వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-బోథ్



రెవెన్యూ డివిజన్ సాధన కోసం బస్టాండ్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 78వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో 1992-93 ఎస్సెస్సీ బ్యాచ్ సభ్యులు కూర్చున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బోథ్ నుంచి తరలిపోయిన కార్యాలయాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడే యోధులు ఆర్మీ జవాన్లు

నవతెలంగాణ-జైనథ్



దేశం కోసం నిరంతరం పోరాడే యోధులు ఆర్మీ జవాన్లని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. మండలంలోని బెల్లూరి గ్రామంలో ఆదివారం ఆర్మీ జవాన్ మార్శెట్టి రాజుకు కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఇటీవలే ఆర్మీ ఉద్యోగంలో 17 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన మార్శెట్టి రాజుకు మండల వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశ సేవ కోసం ప్రతి ఒక్కరూ ముందంజలో ఉండాలని, జవాన్ రాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామ్‌రెడ్డి, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆలోచనని విరమించుకోవాలి : దేవుళ్ల సంజీవ్



నవతెలంగాణ-జైనథ్

ఎస్సీ వర్గీకరణ ఆలోచనలను ప్రతి ఒక్కరూ విరమించుకోవాలని మాల సంక్షేమ మండల అధ్యక్షుడు దేవుళ్ల సంజీవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల పట్టణంలో నిర్మించిన మాల సంక్షేమ భవన ప్రారంభోత్సవానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవాసులు ప్రతి ఒక్కరూ సంఘటితమై సమాజ శ్రేయస్సు కోసం తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కున్మల సురేష్, కొప్పుల దేవన్న, ధార్కలింగన్న, దానిపెల్లి సత్యనారాయణ, రావుల పోచ్చన్న, బండి పోచ్చన్న, సింగిడి నాని పాల్గొన్నారు.

ఐదు తెగలకు రాజ్యాధికారం కల్పించిన వారికే మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదివాసీలోని ఐదు తెగల వారికి రాజ్యాధికారం కల్పించిన వారికే తమ మద్దతు ఉంటుందని పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్ స్పష్టం చేశారు. ఆదివారం మావల మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాలులో పర్ధాన్, కొలాం, తోటి, అంద్, నాయక్‌పోడ్ ఐదు తెగల ఆధ్వర్యంలో రాజ్యాధికారం కోసం ఆదివాసుల చర్చా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్ నుంచి మావలలోని చర్చా వేదిక వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్వ నగేష్ మాట్లాడుతూ ఆదివాసీ గొండు తెగకు చెందిన వారు మిగితా ఐదు ఆదివాసుల తెగకు చెందిన నాయకులపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. దీనికి నిదర్శనమే ఇటీవల కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సొనేరావ్‌పై దాడియేనని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల మంది ఐదు తెగలకు చెందిన వారు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు గుర్తింపు ఇవ్వడం లేదని, కేవలం ఆదివాసీ తెగలలోని గొండు, గిరిజన తెగలోని లంబాడాలను మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఐదు తెగలకు ఆయా పార్టీలు రాజకీయంగా అవకాశాలు కల్పించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. రాజకీయంగా అవకాశాలు సాధించేందుకు తెగలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్టీ రిజర్వ్ స్థానాలున్న అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించడంతో పాటు నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడప సొనేరావ్, జనగ భీముడు, బొంత ఆశారెడ్డి, కౌన్సిలర్ మంగళ రామేశ్వర్, గెడాం మనోహర్, కుమ్ర రాజు, టేకం లక్ష్మణ్, గంగాదేవి పాల్గొన్నారు.

అచూకి లభించిన మృతదేహం అప్పగింత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని భీంసరి వాగులో లభ్యమైన మృతదేహం ఆచూకి తెలిసింది. రూరల్ ఎస్సై ముజహీద్ తెలిపిన వివరాల ప్రకారం... కొన్ని రోజుల కింద బీంసరి వాగులో మృతదేహం లభ్యమైంది. గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో వివరాల కోసం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. అయితే శనివారం పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన వారు ఆ మృతదేహం శ్యామ్‌రావ్(65)గా గుర్తించారు. వారికి మృతదేహన్ని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లక్ష్మీపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్‌కు చెందిన ఆత్రం జంగు(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈనెల 28న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించినట్టు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..



నవతెలంగాణ-జైనథ్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అబివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలంలోని గిమ్మ గ్రామంలో ఆదివారం సాయంత్రం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రజలకు అందిస్తున్నారన్నారు. తల్లి, బిడ్డల సంరక్షణ పట్టించుకున్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ మాత్రమేనని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నామని తెలిపారు. గిమ్మ గ్రామంలో త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, ఎంపీటీసీ భోజన్న, గ్రామ సర్పంచ్ కోల పరమేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరవై ఏండ్లలో జరగని

అభివృద్ధి అయిదేండ్లలో జరిగింది

- రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ పాలనే రాబోతోంది
- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- బాల్క సుమన్ గెలుస్తారని ధీమా
- రూ.312.96కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి, రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గాన్ని గత పాలకులు 60ఏండ్లలో చేయని అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ కేవలం ఐదేండ్లలోనే చేసి చూపించారని రాష్ట్ర పురపాలక,పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని..చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో పర్యటించిన ఆయన రూ.312.96కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత సండ్రోన్‌పల్లి గ్రామంలో రూ.500కోట్ల వ్యయంతో 72ఎకరాల విస్తీర్ణం లో మాట్రిక్స్ సంస్థ నిర్మిస్తున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ భూమి పూజలో పాల్గొన్నారు. కోటి రూపాయలతో షిర్కే కాలనీ లో నిర్మించిన కేసీఆర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాన్ని, ఆదర్శ పాఠశాల ప్రాంతంలో రూ.2 కోట్లతో నిర్మించిన సమ్మక్క సారలమ్మ మహిళా భవన్, పాలచెట్టు ప్రాంతంలో రూ.5 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ప్రాంగణం, 29.68 కోట్లతో కేసీఆర్ కాలనీ లో నిర్మించిన 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా నుండి పాలచెట్టు వరకు రూ.3.30 కోట్లతో నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రూ.40కోట్లతో అర్బన్ మిషన్ భగీరథ పనులను ప్రారంభించారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని రూ.15.16 కోట్లతో నిర్మించిన 286 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను,రూ.18 కోట్లతో గాంధారి వనం వద్ద 250 ఎకరాల్లో నిర్మించే కేసీఆర్ అర్బన్ పార్క్ పనులను ప్రారంభించారు.అనంతరం స్థానిక ఠాగూర్ స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. బీజేపీ కాంగ్రెస్ ఒకవైపు, నికార్సైన బీఆర్ఎస్ నాయకులు మరో వైపు ఉన్నారని, ప్రధాని మోడీ మనసులో తెలంగాణ లేదని కేవలం ఓట్ల వేట కోసమే తెలంగాణ పర్యటనకు వస్తున్నారని విమర్శించారు. గతంలో రామగుండంకు

వచ్చిన నరేంద్ర మోడీ సింగరేణిలో ఉన్న నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణిని ప్రవేటికరణ చేయనని చెప్పిన మోడీ మరునాడే నాలుగు బ్లాకులను వేలం వేశారని గుర్తుచేశారు. బాల్కసుమన్ అభ్యర్ధన మేరకు చెన్నూరులో 1658 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే చెన్నూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని,అలాగే చెన్నూరు మండలంలోని పారుపల్లి, హస్నాద్ గ్రామాలకు నిధులను కేటాయించి నూతన మండలాలుగా ఏర్పాటు చేస్తామని



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేధికపై పలువురు ప్రజాప్రతినిధులు

హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాలలో సింగరేణి లాభాలతో నడుస్తోందని అందులో 32% లాభాల్లో నడుస్తోంది అన్నారు.దీపావళి బోనస్ గా కార్మికుల ఖాతాలో రూ.1000 కోట్ల జమ చేయడం జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సుమన్‌ని భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వించాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారికి 7వ విడత గా 304 మందికి జీఓ 76 ద్వారా ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య,ఆసిఫాబాద్ జడ్పి చైర్మన్ కోవలక్ష్మి,ఎమ్మెల్సీ దండే విఠల్, చెన్నూరు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్,మున్సిపల్ చైర్మెన్, కమిషనర్లు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు,కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, స్థానిక ప్రజాప్రతినిధులు



బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు

కండ్లకు గంతలు కట్టుకొని ఆశాల నిరసన

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్



అదిలాబాద్‌టౌన్

న్యాయమైన ఆశా కార్యకర్తల సమ్మె డిమాండ్లను యూనియన్ బృందంతో ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏడో రోజు సమ్మెలో భాగంగా కండ్లకు గంతలతో నిరసన తెలిపిన అనంతరం మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఆశా వర్కర్లను డబ్ల్యుహెచ్ఓ గుర్తించి, గ్లోబల్ హెల్త్ లీడర్స్ అని అవార్డును ఇచ్చినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయే తప్ప వారి సమస్యలు గుర్తించి పరిష్కరించడం లేదన్నారు. ఆశాలకు నిర్ణిత వేతనం రూ 18వేలు ఇవ్వాలి పెన్షన్ ఇన్స్యూరెన్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఆశా యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమ్.సుజాత, నాయకులు లక్ష్మి, స్వప్న, ప్రేమలత, పద్మ, సునీత పాల్గొన్నారు.



ముధోల్

ముధోల్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయ ఆవరణలో చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 6వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కండ్లకు గంతలు కట్టుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమతో సర్వేలు చేయించుకొని సమస్యలను పరిష్కరించకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ఆరోపించారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.25లక్షల ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఆఫ్సారీ, ఇంద్ర రాధా, రమా, జ్యోత్స్న, గంగామణి, సుజాత, యమున పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పురాతన శ్యామ్‌ఘడ్ కోట వద్ద స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌లతో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సీవీఎస్ రాజు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



నవతెలంగాణ-తాంసి

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె కొనసాగుతుంది. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో పాల్గొని, తమ డిమాండ్లను పరిష్కరించాలని, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయడం జరుగుతుందన్నారు. గత ఆరు నెలల నుంచి వేతనాలు రావడం లేదని అన్నారు. ప్రభుత్వం గుడ్లను రూ.4 చొప్పున ధర ప్రభుత్వం ఇస్తుంది. కానీ గ్రామాల్లో రూ.6కు ధరకు ఒక గుడ్డు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. మిగతా రెండు రూపాయలు మేమే భరించాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం రూ.6చొప్పున ఒక గుడ్డు ధర చెల్లించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే సరుకులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వంట చేయడానికి సిలిండర్లను ప్రభుత్వమే అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాధమ్మ లక్ష్మి, దేవమ్మ, గంగమ్మ ఉన్నారు.

యువత పోరాటాల్లో ముందుండాలి

- పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్



నవతెలంగాణ-ఖానాపూర్

యువత పోరాటాల్లో ముందుండాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో పీవైఎల్ జిల్లా రెండో మహాసభను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలకులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ జిల్లాలో యువతకి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయ నాయకుల అనుచరులుగా తిప్పుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చి, రాజకీయ పబ్బం గడుపుకునే నాయకులపై యువత పోరాడాలన్నారు. అనంతరం పీవైఎల్ జెండాను జ్యోతిరావు ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మోహన్, ఎం.సుందర్, శంభు, భీమ్ రావు, బి.మల్లిఖార్జున్, గణేష్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు అంకుష్ రావు, సోనేరావు, రాజన్న, కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | అక్టోబర్ 02, 2023 | www.navatelangana.com

చెవిలో పువ్వుతో కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చెవిలో పువ్వుతో మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను జీఓ 8 అమలు చేయకుండా మోసం చేసిందని



అన్నారు. కార్మికులు తమ పుస్తెలను సైతం తాకట్టు పెట్టి పిల్లలకు వండి పెడ్తుంటే ప్రభుత్వం గత 8, 9 నెలలుగా బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. వెంటనే సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, యూనియన్ అధ్యక్షులు లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్లు మడావి రాజు, ధాకురే శతృఘ్నులు ఆర్మీలో ఉద్యోగాలు చేసి నేడు పదవీ విరమణ పొందారు. 17 సంవత్సరాల పాటు దేశ సేవ చేసి సొంత మండలానికి రావడంతో మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఇరువురు మాట్లాడుతూ దేశ సేవకై 17 సంవత్సరాలు ఆర్మీలో విధులు నిర్వర్తించడం సంతోషంగా ఉందన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని పలువురు ఆకాంక్షించారు.

ఒంటికాలుపై నిలబడి అంగన్‌వాడీల నిరసన



ఆదిలాబాద్ : ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కనీస వేతనం, ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్ఐ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్ అన్నారు. పది ఏండ్లలో ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందజేసినా పట్టించుకోలేదని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 21వ రోజుకు చేరుకోగా సమ్మెలో భాగంగా ఒంటికాలు మీద నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత 21 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడీ రాష్ట్ర జేఏసీ నాయకత్వంతో వెంటనే చర్చలు సాగించాలన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ మంత్రి సత్యవతిరాథోడ్, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 18న జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి ఇచ్చిన హామీలను విస్మరించి, అంగన్‌వాడీలకు నమ్మక ద్రోహం చేశారని తెలిపారు. ఈ విధానాల కారణంగానే అంగన్‌వాడీలు పోరాట బాటపట్టారని గుర్తుచేశారు. బతకడానికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అడిగితే చావు ఖర్చులకు ఇచ్చే జీఓలను తీసుకురావడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చి సమ్మె విరమణకు కార్యచరణ రూపొందించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో డిమాండ్ల సాధన కోసం సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, పీఎఫ్ఐఎస్ఐ, పెన్షన్, ఇన్సురెన్సు సౌకర్యం కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు అమలుచేయాలి టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించి ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు అందజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, నాయకులు పార్వతి, మధునిక, కవిత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అంగన్‌వాడీలు ఆరోపించారు. ఆదివారం సమ్మె 20వ రోజుకు చేరుకోగా మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రహదారికి ఇరువైపుల వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు సుభద్ర, అర్జునే కుశ్వర్త మాట్లాడుతూ చాలిచాలని వేతనంతో విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సుభద్ర, కమల, నాగుబాయి పాల్గొన్నారు.

సారంగాపూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఆదివారం రాస్తా రోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సామల వీరయ్య సంఘీబావం తెలిపి వారితో రోడ్డుపైనే కూర్చొని మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఎన్నో ఎండ్లుగా కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. పనికి దగ్గ వేతనం రూ.26వేలు చెల్లించి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే వారికి అండగా ఉండి సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు వనజ, భాగ్యలక్ష్మీ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ముథోల్ : అంగన్‌వాడీలు తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకుండా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేష్మ మండల అధ్యక్షురాలు వనిత, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి : రోడ్డుపై బైటాయించి, నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



సారంగాపూర్ : రోడ్డుపై బైటాయించి, నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



ముథోల్ : రోడ్డుపై బైటాయించి, నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఉన్నత విద్యలో ఆదివాసీ విద్యార్థులు సత్తా చాటాలి

- బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్



నవతెలంగాణ-ఉట్నూర్

ఉన్నత విద్యలో ఆదివాసీ, గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని ఉట్నూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో మై డ్రీమ్స్ కం ట్రూ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాపీ జిందగీ మోటివేషనల్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మనపై మనకున్న నమ్మకం మనల్ని విజయం దిశగా నడిపిస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు కళలుగని వాటిని నిజం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించి దేశభక్తి గల పౌరులుగా ఎదగాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక బద్ధంగా చదివితే విద్యలో రాణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సాయికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్‌రావు, లెక్చరర్ మాదాసు మధుకర్, సొసైటీ సభ్యులు వినయ్, నగేష్ ఉన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గుండాల గ్రామానికి చెందిన మహిళా ప్రసవం అవ్వడంతో ఆదివారం డా.రాంబాబు కేసీఆర్ కిట్ పంపిణీ చేశారు. మహిళలు ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగితే రాష్ట్ర ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేసిన సంక్షేమ పథకాలు అందించబడుతుందని పేర్కొన్నారు. అనంతరం స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో వైద్యసిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, పంచాయతీ కార్యదర్శి దినేష్, వైద్యసిబ్బంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన సిద్దుల మోహన్ కుమారుడైన సిద్దుల రిత్విక్(6) వీధి కుక్కలు ఆదివారం తీవ్రంగా గాయపరచడంతో రిత్విక్‌ను మొదటగా రిమ్స్‌కు తరలించగా రిమ్స్ వైద్యులు పరీక్షించి బాలుడిని వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు తెల్పడంతో వెంటనే అంబులెన్స్‌లో తరలించారు. గ్రామంలో దాదాపు 200 వీధి కుక్కలు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. చిన్నపిల్లలు వృద్దులు బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లపై మటన్, చికెన్, దుకాణాల వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. గ్రామసర్పంచ్ మండల అధికారులు కలగజేసుకొని కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు, గర్భిణీలు వెళ్లాలంటే ముందుగా రోడ్డుపై కుక్కలను చూసి బయటకు వెళ్లే పరిస్థితి ఉందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడెల్లి పోచమ్మను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం అడెల్లి శ్రీమహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ప్రత్యేకపూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదం అందజేశారు. అనంతరం మండలంలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు భోల్లోజి నర్సయ్య, నాయకులు మారుతి, విలాస్‌రావు, సింగం బోజాగౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-బాసర

గోదావరిలో ప్రమాదవశాత్తు స్నానం చేస్తూ ఆదివారం యువకుడు మృతి చెందినట్టు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ పట్టణం హామాలివాడకు చెందిన సంతోష్(18) తన స్నేహితులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. ముందుగా గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లిన సంతోష్ అకస్మాత్తుగా నీటిలో మునిగిపోయాడు. దీంతో స్నేహితులు స్థానికంగా ఉన్నవారు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్నీ వెలికితీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్ తెలిపారు.

కులరహిత సమాజానికి ఉద్యమిద్దాం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ



నవతెలంగాణ-కడెం

కులవ్యవస్థ నిర్మూలనకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన కుల నిర్మూలన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కులవ్యవస్థ భారత దేశాన్ని పట్టిపీడిస్తుందని అన్నారు. ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అసమానతలతో పాటు మనషుల మధ్య వ్యత్యాసాలు పెరుగుతున్నాయన్నారు. కులవ్యవస్థ నిర్మూలనకు కలిసి పని చేయాలని అన్నారు. కులం సాంఘిక, సామాజిక, ప్రజాస్వామిక సూత్రాలకు వ్యతిరేకమైందన్నారు. దళిత, మైనార్టీ, ఆదివాసీ, గిరిజనులకు తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు కలిగి ఆత్మ గౌరవంతో జీవించే హక్కును కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షెడ్యూల్డ్ కులాల వారిపై దాడులు, హింస, ప్రజల మధ్య విద్వేషాలు పెరిగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి వాటిపై ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, సునారికారి రాజేష్, హరిత, వెంకటనారాయణ, గోపి నర్సయ్య, వెంకటేష్, వినోద్, కేశవ్, భూక్య విలాస్, లింగన్న పాల్గొన్నారు.

మోకు దెబ్బ జనగర్జన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

చట్టసభల్లో కుల దామాషా ప్రకారం వాటాకై తలపెట్టిన మోకు దెబ్బ జనగర్జన తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 3న నిర్మల్‌లో మోకు దెబ్బ గౌడ గర్జన మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభకు విశిష్ట అతిథులుగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి పద్మారావు, ఎమ్మెల్యేలు, సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు. మహాసభలను జయప్రదం చేసేల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్, జిల్లా నాయకులు శంకర్‌గౌడ్, కాసారం మల్లేష్‌గౌడ్, దుర్గం వెంకగౌడ్, బుర్ర రాజారాంగౌడ్, బూమాగౌడ్ పాల్గొన్నారు.

బాసరలో అర్చకులకు శిక్షణ

నవతెలంగాణ-బాసర

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం సరస్వతి అమ్మవారి సన్నిధిలోని వసతి భవనంలో ధూప దీప నైవేద్యం కింద నూతనంగా నియమింపబడ్డ అర్చకులకు శిక్షణ తరగతులను ఆలయ కార్యనిర్వాహణ అధికారి విజయరామారావు, అదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు శరత్ పాఠక్, ఆలయ స్థానాచార్యుడు ప్రవీణ్ పాఠక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధూపదీప నైవేద్యం కింద ఎంపిక చేయబడ్డ అర్చకులకు ఆయా ఆగమ శాస్త్రాలలో శిక్షణను ఇవ్వడన్నీ అర్చకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. మొదటి రోజు అర్చకులకు వైదిక స్మార్త, వీరశైవ ఆగమం లో శిక్షణ తరగతులు నిర్వహించరు.కార్యక్రమంలో ఆయా జిల్లా నుంచి వచ్చిన అర్చకులు, సరస్వతి ఆలయ ముఖ్య అర్చకులు అచ్యుత్, నవీన్ శర్మ పాల్గొన్నారు.

పారిశ్రామిక పెట్టుబడుల పట్ల

యువతకు అవగాహన ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరిశ్రమల స్థాపనలతో ఆదిలాబాద్ జిల్లా వేగవంతంగా అభివృద్ధి వైపు సాగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డబ్ల్యూ కన్వెన్షన్ హాల్‌లో బీడీఎన్టీ కంపనీ ఆధ్వర్యంలో సీఐఐ తెలంగాణ రోడ్ షో, యువత, పారిశ్రామిక వేత్తలకు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు నెలవు, అడవుల జిల్లా అదిలాబాద్ జిల్లా అని, రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. పరిశ్రమల స్థాపనలతో వేగవంతంగా అభివృద్ది వైపు సాగుతుందని, ఐటీ పరిశ్రమలకు అవసరమైన అన్ని వనరులు ఉన్నాయని అన్నారు. సర్వేల ఆధారంగా అవసరమైన అన్ని సెక్టార్‌లలో ఉత్పత్తుల దిగుమతి ఎక్కువ చేసుకొని, ఎగుమతి తక్కువ చేసుకోవడం ద్వారా జీడీపీ సమాంతరంగా ఉందని అన్నారు. జిల్లాలోని వనరులు, మ్యాన్‌పవర్ వినియోగించుకొని ఉత్పత్తుల తయారీతో ఎగుమతి శాతం పెంచినట్లైతే రాష్ట్ర జీడీపీకి మన జిల్లా శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు పెరగడానికి పారిశ్రామీకరణ అవసరమని, అందుకు వ్యవసాయ, పౌల్ట్రీ, తదితర రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు విస్తృత ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడుల పట్ల యువత అవగాహనా కల్పించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు జిల్లాలో అన్ని వనరులు అందుబాటులో ఉన్నయని, ఔత్సాహికులైన యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని, ఇప్పటికే ఐటీ రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తు పరిశ్రమల స్థాపనకు సైతం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీ రంగంలో స్థానిక యువత రానిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేసి, తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు సైతం ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు.

పత్తి ఉత్పత్తిలో దేశంలోనే జిల్లా పేరుగాంచిందని, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అంతకు ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ సేవలను విస్తృత పరిచేందుకు ప్రభుత్వం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని అన్నారు. పరిశ్రమ రంగంపై యువతకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పలువురు నూతన సంస్కరణల ఆవిష్కర్తలకు ప్రోత్సాహక చెక్కులను అందించి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మెన్ శేఖర్‌రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఐటీ కో-కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు సంయుద్దీన్, బీడీఎన్టీ ఎండీ సంజీవ్ దేశ్‌పాండే, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, యువత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా భావించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా భావించాలని, వారంలో ఒక రోజు పరిసరాల పరిశుభ్రతకు సమయం కేటాయించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు వయోవృద్ధుల సమాఖ్య నాయకులు, యువకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని, పరిసరాల్లో వెలిసిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ పట్టణంలో అపరిశుభ్ర వాతావరణం ఉండకుండా మున్సిపల్ తరుపున వార్డుల్లో చెత్త సేకరణకు ఆటోలు, ట్రాక్టర్లతో పాటు అదనపు సిబ్బందిని కూడా నియమించామని అన్నారు. ప్రజలు సైతం బాధ్యతగా వ్యవహరిస్తూ పరిసరాలను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలని అన్నారు. అదేవిధంగా మున్సిపల్ కమీషనర్ శైలజ మాట్లాడుతూ వ్యాధులు లేని



సమాజ నిర్మాణం కోసం ప్రజలు సహకారం అందించాలన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు.

ఇందులో భాగంగానే స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ర్యాలీలు, వివిధ రకాల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శైలజ, వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, వెంకటేశ్, ఆర్ఓ జాదవ్ కృష్ణ, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | అక్టోబర్ 02, 2023 | www.navatelangana.com

ట్రాన్స్‌కో డీఈఈ వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ట్రాన్స్‌కో డీఈఈ కేవీ రాజశేఖర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం రాత్రి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈఈని పలువురు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఈ నాగరాజు, ఏడీఈ శ్రీనివాస్, కౌటాల ఏడీఈ రాజేశ్వర్, యూనియన్ నాయకులు ఎమ్మాజి సతీష్, చంద్రశేఖర్, వెంకటేష్, రమేష్, ఇర్ఫాన్, జగన్మోహన్, సంతోష్, ఇర్ఫాన్, ఆనంద్, రాజేశం, ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు వీరమల్ల దేవేందర్‌రెడ్డి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ కోమల్ లత పర్యవేక్షణలో రెండు ముఖ్యమైన ఔషధ మొక్కల పరిమాణాత్మక విశ్లేషణపై అధ్యయనం చేసి పరిశోధన పూర్తి చేసినందుకు గాను లక్నోలోని శహరాన్‌పూర్ గ్లోకల్ విశ్వవిద్యాలయం ఇతనికి డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకుడు దేవేందర్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజు, అధ్యాపక బృందం అభినందించారు.



సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపడుతున్న సమ్మె ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని గతంలో సిఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ నాయకులు గిరిజాబాయి, జమున, శ్యామిలి మిస్త్రీ, శివాని హాల్దర్, తనూజ బైరాగి, జంజిరాల రేఖ, గంగుబాయి, గాయత్రి పాల్గొన్నారు.

రెబ్బెన : మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెలో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా మధ్యాహ్నభోజన కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కొత్త మెనూకు అదనపు బడ్జెట్ కేటాయించాలని లేదా పాత మెనూనే కొనసాగించాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ ఇవ్వాలని, గ్యాస్‌కు ప్రభుత్వమే పూర్తి సబ్సిడీ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు. కార్మికులు ప్రమాదబీమాతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

జైనూర్ : జీఓ నెంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలకు బడ్జెట్ కేటాయించి చెల్లించాలని మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం నాయకుడు సోపాన్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయం ఎదుట గత మూడు రోజులుగా కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్లకు అదనంగా బడ్జెట్ ఇవ్వాలని, గ్యాస్‌కు ప్రభుత్వమే పూర్తిస్థాయి సబ్సిడీ ఇవ్వాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్నీ విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

వాంకిడి : మండలకేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట మండలంలోని మధ్యాహ్నభోజన పథకం కార్మికులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు పెంచాలని, ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా, ఎంత పని ఒత్తిడి కలిగిన కూడా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమకు జీతాలు పెంచడంలేదని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్నభోజన పథకం కార్మికులు కోరుతున్నారు.

పెంచికలపేట్: ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికులకు పెంచిన వేతనాన్ని తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నభోజన కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, వంట గ్యాస్‌కు ప్రభుత్వమే పూర్తి సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాదబీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కమల, గంగ, విమల, యశోద, మల్లిక, కరుణాకర్ పాల్గొన్నారు.

బెజ్జూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే పెరిగిన వేతనాల చెల్లింపు బడ్జెట్ విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త మెనూకు అదనపు బడ్జెట్ కేటాయించాలని లేదా పాత మెనూనే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికుల యూనియన్ మండల నాయకులు బాయక్క, సిడాం అమ్బుబాయి, గుజారి గౌరక్క, కొండ కళావతి, కొద్ప పద్మా, శంకరమ్మ పాల్గొన్నారు.



రెబ్బెనలో సమ్మె చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు



జైనూర్‌లో సమ్మెలో భాగంగా నిరసన తెలుపుతున్న కార్మికులు



బెజ్జూర్‌లో సమ్మె చేస్తున్న కార్మికులు



పెంచికలపేట్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

గ్రూప్ పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వ వైఫల్యం

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రూప్ పరీక్షలను నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక కాపు సంఘం భవనంలో మూడో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 1,2,3,4 పరీక్షలకు నోటిఫికేషన్‌లు ఇచ్చి హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పరీక్షలను మాత్రం నిర్వహించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని అన్నారు. పరీక్షలను నిర్వహించలేని టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తున్నాయని అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరిగిందని అన్నారు. డీవైఎఫ్ఐ మాజీ నాయకులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు లేవని అన్నారు. అన్నం, అంబలితో సరిపెట్టడం కాకుండా యువత చదువుకోవడానికి గ్రంథాలయాలు, స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోర్కుటె శ్యాంరావు, గొడిసెల కార్తీక్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాఫర్, డీవైఎఫ్ఐ నాయకులు టికానంద్, రాజ్‌కుమార్, సతీష్, పురుషోత్తం, శ్రావణి, నిఖిల్, పవన్, శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

21వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



నవతెలంగాణ-రెబ్బెన

10 సంవత్సరాల నుండి అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్, కనీస వేతనాల విషయంలో పలు దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పెడచెవిన పెట్టినందువల్లనే గత నెల 11వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు పూనుకోవాల్సి వచ్చిందని అంగన్‌వాడీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెలో భాగంగా ఆదివారం నిరసన తెలిపారు. సమ్మె ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి నిర్దిష్టమైన హామీ రావడంలేదని, ఈరోజు జేఏసీ సంఘాలతో జరిపిన చర్చల్లో కూడా మంత్రి హరీష్‌రావు పాత మాటే మాట్లాడుతున్నాడని, రాబోయే పీఆర్‌సీలో అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని, మిగతా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, ఇంతకుముందు చెప్పిన మాటే మళ్లీ చెపుతున్నారే తప్పా నిర్దిష్టమైన హామీ ఇవ్వడంలేదని ఉద్యోగులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు సమ్మె శిబిరానికి వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, బాలమ్మ, మల్లీశ్వరి, చంద్రకళావతి, మంజుల, స్వర్ణలత, సింధూ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ముస్లిం సోదరులు ఘనంగా మిలాద్ ఉన్ నబీ పండుగను నిర్వహించారు. పట్టణంలోని జామియా మస్జిద్ నుంచి ముస్లిం సోదరులు పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మస్జిద్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముహమ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మౌలానాలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త ఎప్పుడు కూడా ఎవరి మనసు నొప్పించే వారు కాదని, అందరితో సోదర భావంతో ఉండేవారన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర తెలియజేశారు. మసీదు వద్ద స్వీట్లు పంచారు. ముస్లిం యువత ర్యాలీలో పాల్గొన్న వారికి వివిధ చోట్ల త్రాగునీరు శిబిరాలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకుడు శ్యాంనాయక్, టీడీపీ నాయకుడు మల్లికార్జున్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, మైనారిటీ ముస్లిం నాయకులు హైమద్, షేక్ పెన్టు, అసద్, రియాజ్ అహ్మద్, అమర్ బిన్ హసన్, షబ్బీర్, అబ్దుల్ రెహమాన్, ఎండీ సాజిద్, హాఫీస్ జాఫర్, తాజ్, ఇమ్రాన్, సయ్యద్ జావిద్, ఖలీల్ ముస్లింలు భారీ సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల శ్రమదానం



కాగజ్‌నగర్ బస్టాండ్‌లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్న నవోదయ విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యార్థులు ఆదివారం స్థానిక బస్టాండ్‌లో గంట పాటు శ్రమదానం చేశారు. అక్టోబర్ ఒకటో తేదీన గంట పాటు శ్రమదానం చేయాలనే కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు విద్యాలయంలోని స్కౌట్ విద్యార్థులు, ఇతర విద్యార్థులంతా కలిసి బస్టాండ్‌లో పరిసరాలను శుభ్రం చేశారు. నిలిచి ఉన్న మురికి నీటిని తొలగించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో మట్టి పోసి చదును చేశారు. విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణితో పాటు అధ్యాపకులు కూడా స్వయంగా ఈ శ్రమదానంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

పెంచికలపేట్: అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా సందర్భంగా లోడ్‌పెల్లి అటవీ ప్రాంతంలోని సిద్దేశ్వర గుహల వద్ద ఫారెస్టు రేంజ్ అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు రమాదేవి, ప్రభాకర్, బీట్ అధికారి వెంకటేశ్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛాంజలి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో స్వచ్ఛాంజలి కార్యక్రమాన్ని రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, డీఆర్‌డీఓ సురేందర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో వృద్ధుల నుంచి మొదలుకొని చిన్నపిల్లల వరకు స్వచ్ఛాభారత్‌లో పాల్గొనేలా చేసి దేశ ప్రజలందరికి మంచి సందేశాన్నించి ఎవరి పరిసరాలను వారే శుభ్రంగా ఉంచుకోవాలని, దేశ పౌరులందరిలో స్ఫూర్తిని నింపిన కార్యక్రమమే స్వచ్ఛాంజలి కార్యక్రమమన్నారు. స్వేచ్ఛా భారత్‌లో భాగంగా కార్మికులే కాకుండా ఈరోజు యువకులు, పెద్దలు అందరు స్వచ్ఛాభారత్ కార్యక్రమాన్ని తప్పకుండా పాటిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు గంట సేపు శ్రమదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, ఎంపీటీసీ మధునయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అంజత్‌పాషా, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీఓ బుచ్చన్న, ప్రిన్సిపల్ జ్యోతి, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, కుందారపు శంకరమ్మ, యశోద, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, సుదర్శన్‌గౌడ్, వినోద్ జైస్వాల్, సీతారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనూర్ : ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, ఎస్ఐ సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆవరణలో మండల ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వచ్ఛాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో అతి భారీ వర్షాలు కురవడంతో ఇంటి పరిసర ప్రాంతాలను ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉంచడం వల్ల కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మార్లావాయి గ్రామంలో పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, సర్పంచ్‌లు కనక ప్రతిభ వెంకటేశ్, మెస్రం రాహుల్, వార్డు సభ్యులు అఫ్రోజ్ ఖాన్, జైనూర్ ఎంపీటీసీ(2) బీబీనూర్ నాయకులు అజ్జులాల, సయ్యద్ జావీద్ అలీ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఆ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎన్నో కష్టనష్టాలకోర్చి పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వారి సేవలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకి గుర్తింపు కార్డ్ దారులకు మోటార్ సైకిల్ ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికులకు చెందకుండా ఇతర సంక్షేమానికి వాడటం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికుల నిధులను ఆ రంగంలో పనిచేస్తున్న కార్మికులకే ఉపయోగించేలా తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ మాట్లాడుతూ ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్ ముంజం శ్రీనివాస్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు దూడల అశోక్, జిల్లా కోశాధికారి ఆనందరావు, జిల్లా నాయకులు కమలాకర్, రామచందర్, ధర్మాయి రవి పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని ఆశాల నిరసన



ఆసిఫాబాద్‌లో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు చేస్తున్న కలెక్టరేట్ ఎదురుగా నిరసనలో భాగంగా ఆదివారం కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కజేయకుండా సేవలందించిన ఆశా వర్కర్లను డబ్ల్యుహెచ్ఓ గుర్తించి గ్లోబల్ హెల్త్ లీడర్స్ అని అవార్డును ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయే తప్ప వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఆశాలకు స్థిరవేతనం రూ.18,000 ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సురెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఆశా యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శంకు, లలిత, సురేఖ, కవిత, వాణి, లక్ష్మి, యశోద, సుమిత్ర, లత పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న ఆశావర్కర్లకు ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్ సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య విషయంలో పూర్తి బాధ్యత వహిస్తూ విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నా ఆశావర్కర్లకు అన్ని విధాలుగా బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రెబ్బెన : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నెలసరి వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అలాగే పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ రూ.ఐదు లక్షలు మొదలగు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం పట్టింపులకు, పంతాలకు పోకుండా ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి పూర్తిగా మద్దతు తెలిపిన కాంట్రాక్టు కార్మికుల సంఘం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బి అనిత, సుకన్య, డి సునీత, వినోద, లలిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వృద్ధులైన తమ కుటుంబసభ్యులను ప్రతీ ఒక్కరు ఆదరించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు పూర్ణచందర్‌రావు సూచించారు. ప్రపంచ వయోధికుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఆరె సంక్షేమ భవనంలో వృద్ధులను ఆదరిస్తున్న వారి కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. 70 ఏళ్ల దాటిన వృద్ధులు చిన్నపిల్లలతో సమానమని, అటువంటి వారిని ఆదరించడం కుటుంబసభ్యుల బాధ్యత అని అన్నారు. గత కొన్నేళ్లుగా వృద్ధులకు సేవ చేస్తున్న వారు అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎల్లాగౌడ్, నాయకులు బంగారుబాబు, సాంబశివుడు, ప్రకాష్, తూడూరి ప్రకాష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
సోమవారం | అక్టోబర్ 02, 2023 | www.navatelangana.com

ప్రభుత్వ పాఠశాలకు 6 బెంచీల అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రేండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు, ఆదివారంఅదే గ్రామానికి చెందిన (సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ ఆసిఫాబాద్) కస్తూలాపురి సాగర్ 6 బెంచిలను అందించారు. ఒక్కొక్క బెంచ్ విలువ 2000 ఉంటుందని విద్యార్థుల సౌకర్యార్థం తాను చదువుకున్న పాఠశాలకు ఈ చిరు సహాయం చేయడం జరిగిందని సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.తాను ఈ పాఠశాలలో చదివే సబ్ ఇన్స్పెక్టర్ అయ్యానని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయులు బి కిషన్, ఉపాధ్యాయులు, రాజారావు, బాపు, శ్రీలత స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

నల్ల జెండాతో అంగన్‌వాడీల నిరసన

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట మండల కేంద్రంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు చేసే సమ్మె ఆదివారం నాటికీ 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని నల్ల జెండాను ఎగరేసి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ, ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ కార్యక్రమం లో మండల అంగన్వాడీ లు భాగ్య లక్ష్మి, సంగీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ఆశ కార్యకర్తలు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశ కార్యకర్తలు చేపడుతున్న సమ్మె ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి సందర్శించి మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా ఆశ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్నారని, పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న వీరి శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. గతంతో పోలిస్తే ఇపుడు పనిభారం పెరిగిందని, అయినా వారి వేతనం మాత్రం పెరగలేదని అన్నారు. వారి సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరం పద్మ, నాయకులు పంచశీల, పద్మ అనిత, గౌరుబాయి, భాగ్య, మాధవి, లక్ష్మి, శకుంతల, జమీల పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య ఆధ్వర్యంలో జన్నారం పట్టణ పద్మశాలి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఆడెపు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల రమేష్, ఉపాధ్యక్షుడిగా చెట్పల్లి రాజమౌళి, కోశాధికారిగా దోమల భాస్కర్, ప్రచార కార్యదర్శిగా అంజన్న, రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి సత్యం, కందుల రమేష్, శెట్టిపల్లి కృష్ణ, బాలిన మధు, అయ్యోరు రవీందర్ సారంగపాణి, నడిమెట్ల నరేందర్, నాగభూషణం పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో మేరా మిట్టి మేరా దేశ్

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో ఆదివారం తపాలా శాఖ ఆధ్వర్యంలో అమరుల త్యాగాలకు గుర్తుగా మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో యాత్ర నిర్వహించి అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని దేశ రాజధానిలో నిర్మించబోయే నేషనల్ వార్ మెమోరియల్ సమీపంలో అమృత పొంగవన్ గార్డెన్ నిర్మాణానికి పంపనున్నట్లు పోస్టల్ అధికారాలు తాజొద్దిన్, మధూకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడె బాదు, స్థానిక నాయకులు, పోస్టల్ సిబ్బంది భూమన్న పాల్గొన్నారు.

వయో వృద్ధులకు సన్మానం

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం జాతీయ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 82 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శృతి నాందేవ్, అసిస్టెంట్లు విజయ్ కుమార్, మధు పాల్గొన్నారు

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నవతెలంగాణ-తాండూర్

కేటీఆర్ పర్యటన సందర్భంగా సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి తన స్థాయిని దిగదార్చుకున్నారని అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు సత్యవతి అన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాంను అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ ముట్టడించి సొంత పూచికతుపై విడిపించారు. అక్కుల సాధన కోసం 21 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు లీలావతి, పులావతి, అమృత, విజయలక్ష్మి, శారద, పావని, మీనా, సుజాత, ఆశా కార్యకర్తలు కళావతి, సునీత, స్రవంతి, లక్ష్మి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు అరెస్టు

పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ముందస్తు అరెస్టులతో మానవత స్వేచ్ఛను హరిస్తున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొయ్యడ ఏమాజీ అన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను అర్థ రాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం హేయమయిన చర్యగా అభివర్ణించారు. ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో పోలీసులు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని



తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు

అన్నారు. పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. మంత్రుల పర్యటనల సందర్భంగా అరెస్ట్ చేసి నిర్బంధించడం, వేధించడం మానుకోవాలని పోలీసులకు హితవు పలికారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తాండూర్ మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు మహేందర్ గౌడ్ తాళ్లపల్లి భాస్కర్ గౌడ్, సిద్ధం మల్లేష్, రాహుల్, మామిడి విగ్నేష్‌లను తాండూర్ పోలీసులు అరెస్టు చేశారు.

జన్నారం : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఐద్వా మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాకు ఐటి శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకే రవితో పాటు తన అనుచరులను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు, అభివృద్ధి ఎక్కడ జరిగిందో అనే విషయంపై ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే అరెస్టు చేశారన్నారు. కేతస్పల్లి మందమర్రి మండలాల్లో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందమర్రి పట్టణంలోని స్థానిక సింగరేణి హై స్కూల్‌లో నిర్వహించిన సమ్మేళనానికి 1977 నుంచి 2023 వరకు పదో తరగతి చదువుకున్న 46 బ్యాచ్‌ల విద్యార్థులు హాజరయ్యారు. పట్టణంలోని సింగరేణి హై స్కూల్ ముందు ఆర్చ్ నుంచి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తోటి పూర్వ విద్యార్థులను సమ్మేళనంలో కలుసుకున్నందుకు ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అనందంగా గడిపారు. విద్య నేర్పిన గురువులను ఆప్యాయంగా పలుకరించి వారిని ఘనంగా సన్మానించారు. గతంలో పనిచేసి రిటైర్ అయి, వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఉన్నత స్థానంలో స్థిరపడిన వారినందరినీ ఘనంగా



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సన్మానించారు. మహా సమ్మేళనానికి దేశంలోనే కాక వివిధ దేశాల్లో స్థిర పడ్డవారు వాట్సాప్, ఫేస్బుక్ గ్రూపుల ద్వారా మమేకమై సుమారు 3500 మందికి పైగా విద్యార్థులు, 300 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అతిపెద్ద పూర్వ విద్యార్థుల సమ్మేళనమని ప్రోగ్రాం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, కమిటీ అధ్యక్షులు పురుషోత్తం, ప్రోగ్రాం కన్వీనర్ బీరం రవి, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

భారత జాగృతి కమిటీ నియామకం

నవతెలంగాణ-కాసిపేట

భారత జాగృతిని బలోపేతం చేయడంలో భాగంగా కాసిపేట మండల వివిధ పోస్టులలో నియమించినట్లు జాగృతి జిల్లా అధ్యక్షులు లింగంపల్లి ప్రేమ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన నియామకం అయిన వారికి మండల కేంద్రంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియామకం రెండు సంవత్సరాల కాల వ్యవధి కలిగి ఉంటుందని జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు ఆదివారం వారికి నియామక పత్రాలు అందించారు. బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా గంగాధర్ రాజ్ కుమార్, కాసిపేట మండల అధ్యక్షులు సోదారి సురేష్, అధికార ప్రతినిధి దుర్గం శేఖర్, కోశాధికారి ఓరం కిరణ్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సిడాం గణపతి, కో కన్వీనర్లుగా చిత్రం రాందాస్, కనక వంశీకృష్ణ, బింగి చందు, కార్యదర్శులు రత్నం అరుణ్, ఆడే శేఖర్, కాసిపేట మండల మహిళా అధ్యక్షురాలుగా పాలగాని గంగ, అధికార ప్రతినిధిగా ఎల్చుల గంగ, కోశాధికారి పెద్దపల్లి శ్రీవాణి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అక్కేపల్లి తిరుమల,



కాసిపేట జీపీ అధ్యక్షులు రత్నం రాజన్న, ముత్యంపల్లి జీపీ అధ్యక్షులుగా చింతల తిరుపతి, దేవాపూర్ జీపీ అధ్యక్షులుగా రోడ్ లక్ష్మీ నియమితులయ్యారు.

అరెస్టులు అప్రజాస్వామికం : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల జిల్లాలో ఐటీ మంత్రి పర్యటనలో భాగంగా ముందస్తుగా శనివారం రాత్రి సీపీఐ(ఎం), అనుబంధ సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లాలో హెల్త్ ఏమర్జెన్సీ ప్రకటించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులకు ఉద్యోగుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని అడగడం తాము చేసిన తప్పా అని ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఇలా ముందస్తుగా అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాసిపేటలో సంకె రవి, కోటపల్లిలో కావిరీ రవి, తాండూర్‌లో దాగం రాజారాం, మందమర్రిలో దూలం శ్రీనివాస్, బెల్లంపల్లిలో దాగం శ్రీకాంత్‌లను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు.

సిర్పూర్‌లో ప్రోటోకాల్ వివాదం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-సిర్పూరు(టి)

సిర్పూరు (టి) మండలంలో శుక్రవారం జరిగిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటనలో అధికారులు తమకు గౌరవం ఇవ్వలేదంటూ అధికార పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేకు ఫిర్యాదు చేశాడు. తన ఎంపీటీసీ పరిధిలో జరిగిన అధికారిక కార్యక్రమాల్లో శిలాఫలకం పేరు లేక పోవడం తమను అమావనపర్చాడమేనని అన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొన్న కార్యక్రమాల్లోనే తమకు గౌరవం ఇవ్వకుండా అధికారులు వ్యవహరించారని కలెక్టర్‌కు తెలియజేశారు. స్థానిక ఎంపీటీసీనే కాకుండా మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అయినా తన పేరుతో పాటు స్థానిక సర్పంచ్ పిట్టల రవి పేరు కూడా శిలాఫలకంలో పొందుపర్చలేదంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమకు విలువ ఇవ్వకుండా తమ కంటే కింది స్థాయిలో ఉన్న మండల కోఆప్షన్ సభ్యుడి పేరును అందులో పొందుపర్చి తమను అగౌరవపర్చారని, దీనికి బాధ్యులైన ఆర్అండ్‌బీ అధికారులపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నేటి జర్నలిస్టుల ఆందోళన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేసి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో సోమవారం చేపట్టే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో జర్నలిస్టులకు రైల్వే పాసు రాయితీ ఉండేదని, అక్రెడిటెడ్ జర్నలిస్టులకు యధావిధిగా రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలన్నారు. పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉదయం 11 గంటలకు నిర్వహించే ఆందోళన విజయవంతం చేయాలని కోరారు.

వార్షిక క్రీడలను ప్రారంభించిన జీఎం మనోహర్



నవతెలంగాణ-మందమర్రి

డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 59వ వార్షిక క్రీడలను ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఏరియా స్థాయి బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, కల్చరల్ ఈవెంట్‌లను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రీజియన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు ప్రతీ సంవత్సరం క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కోల్ ఇండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి మంచి పేరు తీసుకువస్తున్నారన్నారు. సీనియర్ క్రీడాకారులు యువ ఉద్యోగులను క్రీడల వైపు దృష్టి సారించేల ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఏఐటీయూసీ నాయకులు బానయ్య, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, హెచ్ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి, డీవై పీఎం మైత్రేయ బందు, సంక్షేమ అధికారి వంశీ, రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సీహెచ్ అశోక్, కోఆర్డినేటర్ రవి కుమార్, బాడీ బిల్డింగ్ కెప్టెన్ వెంకటేశ్వర్లు, కల్చరల్ కెప్టెన్ సుదర్శన్, జనరల్ క్యాప్టెన్ చిన్నయ్య గ్రౌండ్ ఇన్‌చార్జ్ తిరుపతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

తాండూర్‌లో ..



నవతెలంగాణ-తాండూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు తాండూర్ శాఖ చీఫ్ మేనేజర్ దాముక ప్రభుదాస్ అన్నారు. ఆదివారం తాండూర్ జడ్పీ హై స్కూల్ ఆవరణలో స్వయం సహాయక బృందాలతో కలిసి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల సంతతిని నిరోధించవచ్చునని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని సంపూర్ణ ఆరోగ్యం వల్ల అన్ని సౌభాగ్యాలను పొందవచ్చుని తెలిపారు. హై స్కూల్ ఆవరణలో పిచ్చి మొక్కలను చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, స్కూల్ సిబ్బంది, స్కూల్ చైర్మన్ చంద్రయ్య పాల్గొన్నారు.

ద్వారకాపూర్‌లో గ్రామసభ

మండలంలోని ద్వారకాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ శారద అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి పంచాయితీలో సమిష్టి శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో గ్రామ ప్రజలకి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై అవగాహనా కల్పించిచారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. శ్రమదానం చేసే పని ప్రదేశాలను గుర్తించి తీసుకునే చర్యల గురించి చర్చించారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

జన్నారం : నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అతరిటీ సూచనల మేరకు దేశంలోని అన్ని టైగర్ రిజర్వులలో నిర్వహిస్తున్నటు వంటి స్వచ్ఛత పక్వాడ స్వచ్ఛత్తా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని గేట్ నెంబర్ 1 వద్ద ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్డిఓ మాధవరావు మాట్లాడుతూ, చెట్లను మనం రక్షిస్తేనే అవి మనన్ని రక్షిస్తాయన్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

తపాల్‌పూర్ గ్రామంలో..



జన్నారంలో ..



కాసిపేట్‌లో ..

స్వచ్ఛతహే సేవ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మండలంలోని తపాలాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శ్రమదాన చేశారు. పరిశుభ్రతపై గ్రామములో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లశెట్టి మురళిధర్, దుంపల తిరుపతి, సర్పంచ్ నైనాల తిరుపతి, సెక్రెటరీ ఉపాధ్యాయులు తిరుపతి పాల్గొన్నారు.

కాసిపేట : సోమగూడెం భరత్ కాలని గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించి శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీలాగౌడ్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉంటుందని, ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాయలింగు, స్థానికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 02, 2023 | www.navatelangana.com

రహదారిపై బైఠాయించి నిరసన

నవతెలంగాణ-బాసర



సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు తలపెట్టిన సమ్మె ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. నిజామాబాద్-భైంసా రహదారిపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అంగన్‌వాడీ అద్దె బకాయిలను చెల్లించాలని, అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు రహదారిపై బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజియా, లక్ష్మి, అరుణ, సాయవ్వ, సరోజ, హెల్పర్లు పాల్గొన్నారు.

నిమజ్జనంలో గాయపడ్డ బాలులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్



వినాయక నిమజ్జనంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ చేయూతను అందించారు. చికిత్స కోసం వారికి రూ. 5వేలు ఆర్థిక సాయం వడ్డెర సంఘం అధ్యక్షుడు తిరుపతికి అందించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

సమగ్ర అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- మాల సంక్షేమ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ సమగ్ర అభ్యున్నతికి కృషి చేస్తూ, ప్రభుత్వం పాటు పడుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. న్యూ హౌజింగ్ బోర్డ్ కాలనీలో నిర్మించిన మాల సంక్షేమ సంఘ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమ అతిథులకు బ్యాండు మేళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు అతిథులను శాలువాలతో సత్కరించారు. రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాలల సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. జైనథ్‌లోనూ మాల సంక్షేమ భవన్ నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధే పరమావధిగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దళితబంధు విషయంలోనూ జనాభా ప్రాతిపదికన లబ్దిదారులను ఎంపిక చేసి అర్హులకు కేటాయిస్తున్నామని తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ కోసం రెండెకరాల భూమిని కేటాయించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, రాష్ట్ర మాల మహానాడు జేఏసీ కన్వీనర్ రాంచందర్, జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, మావల జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, మెట్టు ప్రహ్లాద్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది

నవతెలంగాణ-జైనథ్

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నిరాల గ్రామంలో జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో చూపించిన ఏ ఒక్క హామీను ఎమ్మెల్యే నెరవేర్చలేదని అన్నారు. ఆదిలాబాద్ ప్రజలకు మాయమాటలను చెబుతూ, ప్రతీ సంవత్సరం మభ్యే పెడుతూ వస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిర్వాసితులు అయిన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, అయుష్మాన్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు రాందాస్, అదిలాబాద్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్, ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్, గజానంద్, ప్రవీణ్, రమేష్, అశోక్, సుభాష్, గేడం శివ పాల్గొన్నారు.

ఫసల్ బీమా లేక రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-జైనథ్

రైతులను ఆదుకునేల కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని తీసుకువచ్చిందని, కానీ తెలంగాణలో అమలు చేయని కారణంగా రైతులు నష్టపోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నిరాల గ్రామంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సహకరించగా పంటలు నష్టపోతే పరిహారం వచ్చేల కేంద్రం ఫసల్ బీమా పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇటీవల నియోజకవర్గంలో రైతులు పంటలు నష్టపోయిన పరిహారం రాలేదన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే రామన్న కేసీఆర్ వద్ద ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కానీ రైతులు, ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. అధికారంపై ఉన్న శ్రద్ధ ప్రజ, రైతు సమ్యలపై లేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేల ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రాందాస్, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ విజయ్, రమేష్, చంద్రకాంత్, సుభాష్, బింగి వెంకన్న, అన్నెల అశోక్ పాల్గొన్నారు.

చలో నిజామాబాద్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ముథోల్

ఈనెల 3న నిజామాబాద్‌కు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్ కోరారు. నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసి సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి బీజేపీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిపాండే, నారాయణరెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి పోచం, అసెంబ్లీ కన్వీనర్- తాడేవార్ సాయినాథ్ అసెంబ్లీ కోకన్వీనర్ సుమన్, మాజీ ఎంపీపీ సుభాష్ పటేల్, స్థానిక ఎంపీటీసీ భూమేష్, మండల అధ్యక్షులు కోరి పోతన్న బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, యువ మోర్చ నాయకులు, బీజేపీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని ఆశాల నిరసన

నవతెలంగాణ-లోకేశ్వరం

ఆశాకార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఆదివారం కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామ గ్రామాన స్వచ్ఛత కార్యక్రమం



ఆదిలాబాద్‌టౌన్



నార్నూర్



బాసర

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో, నాయకులు చీపురును చేత పట్టి శుభ్రం చేశారు. రామాలయంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ స్వయంగా చీపుర పట్టి ఊడ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ మాట్లాడుతూ రోజుకు కొద్దీ సమయాన్ని పరిశుభ్రత కోసం కేటాయించాలన్నారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో బీజేపీ అధ్యక్షులు పాయల శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో చీపుర్లు పట్టుకొని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021లో నరేంద్రమోడీ చెప్పట్టిన స్వచ్ఛభరత్ అద్భుతమైన మైలు రాయి అన్నారు. దేశంలో వృద్ధుల నుంచి మొదలుకొని చిన్న పిల్లల వరకు స్వచ్ఛ భారత్‌లో పాల్గొనేలా చేసి దేశ ప్రజలందరికీ మంచి సందేశాన్ని ఇచ్చి ఎవరి పరిసరాలు వాళ్లే శుభ్రంగా ఉంచుకోవాలని దేశ పౌరులందరిలో స్ఫూర్తిని నింపిన కార్యక్రమం అన్నారు. జిల్లా ప్రజలందరూ, యువకులు వారానికి ఒకసారి తమ తమ పరిసర ప్రాంతాలను ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గంట సమయం కేటాయించి శ్రమదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుహాసినిరెడ్డి, ఆకుల ప్రవీణ్, జోగు రవి, విజయ్, ధోని జ్యోతి, పద్మ దినేష్ మటోలియ, వేదవ్యాస్, రాజేష్, పెంటాజీ, సుభాష్, సాయి ముకుందరావు, కృష్ణ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...

దేశవ్యాప్తంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక గంట పాటు కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.దయాకర్, వాలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో, కళాశాల బయట చెత్త, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు.

బేల : ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.శ్యామల తెలిపారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహిళలతో స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి కళాశాల ఆవరణను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ చెన్నాల రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోష్, ఫీల్డ్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.



తలమడుగు

నార్నూర్ : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఖంపూర్, ఉమ్రి, తాడిహత్నూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రమదానం నిర్వహించి, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు సలాం ఆనంద్‌రావ్, రాథోడ్ రవీందర్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శులు కొల శేఖర్, కాశీరాం, దళిత నాయకులు శేఖర్ జాదవ్ పాల్గొన్నారు.

బాసర : గోదావరి నది బ్రిడ్జిపై బాసర మండల కేంద్రానికి చెందిన యువకులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనాల సందర్భంగా బ్రిడ్జ్‌పై చెత్త పేరుక పోయి ద్విచక్ర వాహనదారులకు ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేవి దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తుగా యువకులు ఏకమై బ్రిడ్జి పైన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర చెత్తాచెదారాన్ని తొలగించారు.

స్వచ్ఛ భారత్ నిర్వహించిన బీజేపీ నాయకులు...

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆలయ పరిసరాలలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీపుర్లతో చెత్త చెదరాన్ని ఊడ్చి వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాష్ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్మికులతో కలిసి రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, సర్పంచ్ సాకి ఆనంద్, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నల్ల దేవిదాస్, సంతోష్, బీఆర్ఎస్ నాయకులు నాగారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని పట్నాపూర్ గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. అనంతరం గ్రామంలో డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, ఏఈఓ శ్యామ్, వార్డు సభ్యులు ఆత్రం మోహన్, కార్యదర్శి మితున్, హెల్త్ అసిస్టెంట్ గోవింద్, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీలు సుశీల, శోభ, ఐకేపీ సీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాంసి : స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. గ్రామాలలో పరిసరాలను గ్రామసర్పంచ్‌లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచులు స్వప్న ప్రకాష్, లింబాజీ, సదానందం, వెంకన్న, అశోక్, గజానన్, కార్యదర్శులు గంగన్న, విజయ్, అజయ్, అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లను ఊడ్చి, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా సర్సాపూర్(జి) మండల కేంద్రంతో పాటు గొల్లమాడ, రాంపూర్, టెంబుర్ని గ్రామాల్లో ఆదివారం శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు, అధికారులు, మహిళలు గ్రామప్రజలు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చెన్న మహేష్, గోవింద్‌రెడ్డి, దత్తు, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ, మండల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని జోహర్‌పూర్ గ్రామ పంచాయతీలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వీధులు, స్కూల్ శుభ్రం చేశారు. చెత్త చెదారం లేకుండా రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు తొలగించారు. వీధుల గుండా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్రవ్వ దిగంబర్, ఉపసర్పంచ్ బోజన్న, కార్యదర్శి సృజన, ఉపాధిహామీ సిబ్బంది, ఏపీఓ, టీఏలు హరిత, శారద కారోబారి నర్సయ్య పాల్గొన్నారు.



తాంసి



ఆదిలాబాద్ రూరల్



లోకేశ్వరం

ఓపిక ఉన్నంతవరకు ప్రజాసేవలోనే ఉంటా

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ
- భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఓపిక ఉన్నంతవరకు ప్రజాసేవలోనే ఉంటానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మండలంలో బైక్ ర్యాలీలతో వెళ్లి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సాయంత్రం నామనగర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూర్ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమను గుర్తించి, సీఎం కేసీఆర్ తనకు టికెట్ కేటాయించారని అన్నారు. మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు. తనకున్న నిబద్ధత, అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చూసి ఆశీర్వదించాలని కోరారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. అంతకు ముందు వంజీరి నుంచి ప్రధాన రహదారి వరకు, నందిగూడకు రూ.కోటి నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అందవెల్లి నుంచి ఈజ్‌గాం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణ, మున్సిపల్ చైర్మెన్ సద్దాం హుస్సేన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్ధిక్, ఎంపీపీ శంకర్, సర్పంచ్‌లు ముంజం రమేష్, మేకర్తి గంగన్న, నాయకులు గజ్జి రామయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్ఓ తుకరాంభట్ అన్నారు. మండలంలోని అడ ఆస్పత్రి ఆవరణలో కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఆస్పత్రి ఆవరణ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పరిశుభ్రత ఉండేలా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ ఆస్పత్రి వైద్యాధికారి వినోద్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువల పనులు ప్రారంభం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కొర్సిని గ్రామంలో మండల పరిషత్ రూ.2 లక్షల నిధులతో సైడ్ డ్రైన్ పనులను సర్పంచ్ కొడిపే శ్యామల ప్రారంభించారు. ఆదివారం ఎంపీటీసీ రోజాతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చౌదరి శంకర్, నాయకులు సుధాకర్, దండిగా శంకర్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

- యువకుని వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిప్రి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పిప్రి గ్రామానికి చెందిన కడవేణి శ్రీనివాస్ కూతురు కడవేణి శిరిష(23) అదే గ్రామానికి చెందిన మేకల స్వామి కుమారుడు మేకల నరేష్ ఆర్మీ జవాన్ ఏడు నెలల క్రితం తరుచూ ఫోన్‌లో వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో యువకున్ని సముదాయించారు. వారం రోజుల క్రితం నరేష్ సెలవుపై గ్రామానికి వచ్చాడు. కొత్త ఫోన్ నెంబరు ఇతరుల నుంచి సేకరించుకుని మళ్లీ ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేశాడు. శనివారం రాత్రి సమయంలో ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో అస్పత్రికి తరలించే క్రమంలో మరణించింది. యువకుడి వేధింపుల వల్లే తన కుతూరు ఆత్మహత్య చేసుకుందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌లో నాయి బ్రాహ్మణుల చేరిక



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్‌లో మండల నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు చేరారు. ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జన్సాన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్‌తో పాటు అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. నాయి బ్రాహ్మణులంతా మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. వారికి ప్రభుత్వం మరింత అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు గొల్లపల్లి రమణ, కార్యదర్శి కస్తూరి నరేందర్, పట్టణ అధ్యక్షులు కస్తూరి నాగేందర్, కార్యదర్శులు మరిపెల్లి శేఖర్, నవీన్, సత్యం, రాజన్న, లచ్చన్న, అంజన్న పాల్గొన్నారు.